సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 1 । ఏప్రిల్ । 2023



శ్రీవారికి కాసుల పంట

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. రూ.1.32 కోట్ల ఆదాయం లభించింది.

8లో ▸



'ఉపాధి' వేతనం పెంపు

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల వేతనాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచింది. దీనిపై కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

8లో ▸

మహిళ హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మహిళను హతమార్చిన కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ ఏలూరు ఎనిమిదో అదనపు జడ్జి సునీల్‌కుమార్ తీర్పు చెప్పారు.



8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం సాయంత్రం	సహరి ఆదివారం వేకువజాము
భీమవరం	6.24	4.38
తాడేపల్లిగూడెం	6.26	4.46
నరసాపురం	6.23	4.37

న్యూస్‌రీల్

డీఐజీ పరిశీలన



డీఐజీ పాలరాజుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

సాక్షి,భీమవరం: పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయాన్ని శుక్రవారం ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు సందర్శించారు. ఎస్పీ యు.రవిప్రకాష్, అడిషినల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎస్పీ కార్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బందిని డీఐజీ పాలరాజు పరిచయం చేసుకుని జిల్లాలో నమోదైన కేసులు, వాటి పరిష్కారంపై వివరాలు తెలుసుకున్నారు.

కేసులను సత్వరమే పరిష్కరించాలి

పోడూరు: స్టేషన్‌లో నమోదు చేసిన కేసులను సత్వరమే పరిష్కరించాలని ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు అన్నారు. పోడూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి ఇక్కడ సదుపాయాలు, రికార్డులను పరిశీలించారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ కె.శ్రీనివాస్‌కుమార్, ఎస్సై వై.నాగలక్ష్మి ఆయన వెంట ఉన్నారు.

భీమవరం మార్కెట్‌యార్డ్‌లో కలెక్టరేట్

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని భీమవరం మార్కెట్‌యార్డ్‌లో ఏర్పాటుచేసేలా ప్రభుత్వం జీఓ జారీ చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. భీమవరం గునుపూడి రెవెన్యూ గ్రామ పరిధిలోని మార్కెట్‌యార్డ్‌లోని ఖాళీ ప్రదేశంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం నిర్మించేలా జీఓలో పేర్కొన్నట్టు చెప్పారు.

వేగంగా పూడిక పనులు



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి,భీమవరం: జగనన్న లేఅవుట్లలో పూడిక పనులు వేగంగా జరిగేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం విలేకరులతో నియోజకవర్గంలో ప్రభుత్వ లేఅవుట్లలో చాలా చోట్ల పూడిక పనులు పూర్తికాగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టారని, అయితే కొన్నిచోట్ల పూడిక పనులు పూర్తికాలేదని, ఆయా ప్రాంతాల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. గృహనిర్మాణాల ప్రగతిపై కూడా సమీక్షించామన్నారు. పట్టణంలోని విస్సాకోడేరు లేఅవుట్‌లో ప్రస్తుతం 2 వేల మంది గృహ నిర్మాణాలు చేపట్టగా మిగిలిన లబ్ధిదారులు కూడా త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలని ఆదేశించామన్నారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ జి.పిచ్చయ్య, ఈఈ బి. వెంకటరమణ, తహసీల్దార్ ఎం.సుందర్‌రాజు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఉచిత ప్రయాణం

భీమవరం(ప్రకాశం చౌక్): వచ్చేనెల 3 నుంచి 18వ తేదీ వరకూ జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి ఇంటి నుంచి పరీక్షా కేంద్రం వరకూ పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ ఇంగ్లిష్, తెలుగు, గణితం, సివిక్స్, హిందీ సబ్జెక్టుల జవాబుపత్రాల మూల్యాంకనం శనివారం నుంచి ప్రారంభమవుతుందని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని జూనియర్ కళాశాలల నుంచి చీఫ్ ఎగ్జామినర్లు, ఎగ్జామినర్లుగా నియమించిన జూనియర్ అధ్యాపకులను రిలీవ్ చేయాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించామని పేర్కొన్నారు.

ఆక్వా రైతులకు శుభవార్త

- విద్యుత్ రాయితీ దరఖాస్తులకు అవకాశం
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 3.25 లక్షల ఎకరాల్లో సాగు
- సుమారు 27 వేల విద్యుత్ కనెక్షన్లు
- ఇప్పటివరకూ 17,250 కనెక్షన్లకు సబ్సిడీ వర్తింపు
- మరింత మందికి అందించేలా చర్యలు



భీమవరంలో రొయ్యల చెరువులో తిరుగుతున్న ఏరియేటర్

సాక్షి,భీమవరం: రాష్ట్రంలో ఆక్వా సాగుకు అన్నివిధాలా అండగా నిలుస్తూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోంది. దీనిలో భాగంగా ఆక్వా సాగుకు విద్యుత్ సబ్సిడీ పొందేందుకు రైతులకు మరో అవకాశం ఇచ్చింది. ఇప్పటివరకు విద్యుత్ రాయితీ పొందలేకపోతున్న అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించింది. రైతు సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వాసాగుకు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ.1.50 అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో రైతులు ఆక్వా సాగుకు విద్యుత్ వినియోగిస్తున్నారు. సబ్సిడీ విద్యుత్ వినియోగం కారణంగా పెద్ద మొత్తంలో పెట్టుబడులు తగ్గడంతో రైతులు ఏటా మూడు పంటల్లో రొయ్యల పట్టుబడి చేస్తున్నారు.

3.25 లక్షల ఎకరాల్లో..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సుమారు 3.25 లక్షల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తుండగా సుమారు 27 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

- పశ్చిమగోదావరి జిల్లాలో 1,01,858 ఎకరాల సాగుకు సుమారు 13,856 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఆక్వాజోన్ పరిధిలో ఉన్న దాదాపు 8,059 విద్యుత్ కనెక్షన్ల ద్వారా సుమారు 40 వేల మంది రైతులు సబ్సిడీ విద్యుత్ పొందుతున్నారు. వీరందరికీ యూనిట్ రూ.1.50లకు ప్రభుత్వం సరఫరా చేస్తోంది.
- ఏలూరు జిల్లాలో సుమారు 1.98 లక్షల ఎకరాల్లో ఆక్వాసాగు ఉండగా 13,205 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో దాదాపు 9,191 విద్యుత్ కనెక్షన్ల ద్వారా రైతులు సబ్సిడీ విద్యుత్ పొందుతున్నారు.

ఆక్వా రైతులకు మేలు చేసేలా..

ఆక్వా రైతులకు మేలు చేసేలా కోవిడ్ సమయంలో ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. ప్రధానంగా రొయ్యలు, చేపల ఎగుమతులు తగ్గిపోవడంతో ధరలు తగ్గి చెరువుల్లో పట్టుబడులు చేయలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే చెరువుల్లోని రొయ్యలు, చేపలకు మేతలు వేసి పెంచలేక నష్టపోయారు. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు ధరలు మరింత తగ్గించిన సమయంలో ప్రభుత్వం చొరవ తీసుకుని కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేసేలా ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఇటీవల ఆక్వా మేతల ధరలు పెరిగి రొయ్యల ధరలు పతనమైన సమయంలోనూ మంత్రులు, అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేసి ప్రభుత్వం ప్రకటించిన ధరలకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

అర్హులందరికీ వర్తించేలా..

ఆక్వా సాగులో అర్హత ఉన్నా సబ్సిడీ పొందలేని రైతులు చాలా మంది ఉన్నారు. వీరంతా ఆక్వా రైతుల సంఘాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యను విన్నవించుకున్నారు. దీంతో ఆక్వా జోన్‌లో ఉన్న పదెకరాలలోపు రైతులు ఈ–ఫిష్‌లో నమోదు చేసుకుంటే విద్యుత్ సబ్సిడీ పొందేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రైతులు కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి అధికారులు అవకాశం కల్పించారు. అర్హులైన రైతులంతా తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే సబ్సిడీ విద్యుత్ పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు చేసుకోవచ్చు



అర్హత కలిగి విద్యుత్ సబ్సిడీ పొందలేకపోతున్న ఆక్వా రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆక్వాసాగు చేస్తున్న భూములు ఆక్వాజోన్‌లో ఉండాలి. ఈ–ఫిష్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి. రైతులు తమ సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో మత్స్యశాఖ సిబ్బందిని కలిసి వివరాలు అందిస్తే విద్యుత్ రాయితీ పొందేందుకు అవకాశం ఉంటుంది.

– ఎల్ఎల్ఎస్ రాజు, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, భీమవరం

పుష్కరిణి ప్రక్షాళనకు చర్యలు



కొతాలపర్రులో పుష్కరిణిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రెండో శ్రీరంగంగా పేర్గాంచిన కొతాలపర్రులోని కేశవస్వామి ఆలయ పుష్కరిణిని ప్రక్షాళన చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశించారు. శుక్రవారం అధికారులు, నాయకులతో కలిసి ఆయన పుష్కరిణిని పరిశీలించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో చెరువు పూర్తిగా కలుషితంగా మారిందన్నారు. పుష్కరిణి ప్రక్షాళనకు తాము చర్యలు తీసుకుంటామని, చెరువును పూర్తిగా సుందరీకరిస్తామన్నారు. దీని ద్వారా మంచి నీటి చెరువుగా మార్చవచ్చన్నారు. చెరువుకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. త్వరితగతిన ప్రక్షాళన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వైస్ ఎంపీపీ తోలేటి శ్రీను, సొసైటీ అధ్యక్షుడు కోళ్ల గోవిందరావు, కేశవస్వామి దేవస్థానం చైర్మన్ కొమ్మిరెడ్డి త్రిమూర్తులు, సొసైటీ మాజీ చైర్మన్ కాకిలేటి బాపిరాజు తదితరులు ఉన్నారు.

మహిళాభ్యున్నతికి సీఎం జగన్ కృషి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ఇరగవరం మండలం తూర్పువిప్పర్రులో ఆసరా మూడో విడత కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ఇరగవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మహిళల ఆర్థిక స్వావలంబన, అభ్యున్నతి జరుగుతోందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం తూర్పువిప్పర్రు గ్రామంలో మూడో విడత ఆసరా కార్యక్రమంలో 13,396 మంది మహిళలకు రూ.14,26,75,039 చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో డ్వాక్రా రుణమాఫీకి చంద్రబాబు హామీ ఇచ్చి మహిళలను మోసం చేశారని, అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేశారన్నారు. ఇప్పటివరకూ మూడు విడతల్లో రుణమాఫీ చేశారన్నారు. అమ్మఒడి పథకం ద్వారా తల్లులకు ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఆసరా మహిళల పండుగ అని, దూరదృష్టితో ఆలోచించి సీఎం జగన్ డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తున్నారన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ అలివేలు మంగతాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు సైపురెడ్డి పెద్దిరాజు, మల్లిరెడ్డి నాగార్జున, ఏపీఎం పుష్పవతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'చంద్రబాబు ఎమ్మెల్యేలను కొన్నాడు'

ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక ఎమ్మెల్యేకు రూ.15 కోట్లు, మరో ఎమ్మెల్యేకు రూ.20 కోట్లు ఇచ్చి చంద్రబాబు కొనుగోలు చేశాడని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 14 ఎమ్మెల్సీ స్థానాలు గెలిచిన వైఎస్సార్ సీపీ మామూలుగానే ఉంటే నాలుగు స్థానాలు గెలిచిన చంద్రబాబు మిడిసి పడుతున్నాడని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చంద్రబాబు ఉవ్విళ్లూరుతున్నారని, అది ఎంత మాత్రం జరగదని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఇచ్చిన, ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తున్న సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లోనూ మద్దతుగా నిలవాలని ఆయన కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చాలి

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ అధ్యక్షతన సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నరసాపురం నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ ముదునూరి మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్న దృష్ట్యా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసుకునేలా అధికారులు పనిచేయాలన్నారు. రోజూ అధికారులు లేఅవుట్ల వద్దకు వెళ్లి పరిస్థితులు అధ్యయనం చేయాలని ఇబ్బందులుంటే తనకు తెలియజేయాలన్నారు. ఇకపై ప్రతివారం నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానన్నారు. లేఅవుట్లలో డ్రైనేజీ, విద్యుత్, అప్రోచ్‌రోడ్లు నిర్మించాలన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో శ్మశాన వాటికల సమస్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 10 వేల ఇళ్లు మంజూరు చేయగా 2,200 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. 6,500 ఇళ్లు పునాది దశలో ఉన్నాయన్నారు. రుస్తుంబాదలో 4 వేల మందికి 93 ఎకరాల లేఅవుట్‌లో ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఇప్పటికే 19 ఎకరాల్లో మట్టి పూడిక పూర్తిచేశామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాబ్జి, తహసీల్దార్లు ఎండీ ఫాజిల్, జి.అనితకుమారి, ఎంపీడీఓలు ఎస్ఎస్ ప్రసాద్, ఆర్‌సీ ఆనంద్, హౌసింగ్ ఈఈ సిద్ధాంతి పాల్గొన్నారు.

'అబిబస్' ద్వారా ఆర్టీసీ సమాచారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ బస్సుల్లో దూరప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులు బస్సు ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి యామినిక్స్ యాప్ ద్వారా అవకాశం ఉండేదని, ఈ సౌకర్యాన్ని ఇకపై అబిబస్ యాప్ ద్వారా కూడా కల్పించినట్టు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ఇది అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

అగ్నిప్రమాదంపై మంత్రి ఆరా



ఆలయంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్: దువ్వ గ్రామంలోని వేణుగోపాలస్వామి, సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిన స్థలాన్ని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఆలయాన్ని సందర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుట్రకోణం ఏమైనా ఉందా? అని ఆరా తీశారు. భవిష్యత్‌లో ఉత్సవాలు జరిగే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, భక్తులతో మాట్లాడారు. సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ అధికారుల పరిశీలన

సంఘటనా స్థలాన్ని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు, రీజినల్ జాయింట్ కమిషనర్ సురేష్‌బాబు పరిశీలించారు. డీఈఈ శ్రీనివాసరావు, ఏఈ ఉదయ భాస్కర్, స్థపతి నెహ్రూ, వైఖానస ఆగమశాస్త్ర పండితుడు రమణబాబు నష్ట వివరాలను తెలుసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ నాయకులతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

లింగ నిర్ధారణ పరీక్షలను ఉపేక్షించం

కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం ప్రకాశంచౌక్: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై జిల్లాస్థాయి మల్టీ మెంబర్స్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలపై తరచూ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలను నిరోధించేందుకు డెకాయ్ ఆపరేషన్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్‌కు అన్ని అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 131 స్కానింగ్ కేంద్రాలు నమోదు కాగా 121 సెంటర్లు పనిచేస్తున్నాయన్నారు.

ప్రణాళికతో పాల సేకరణ : జిల్లాలో అమూల్ విస్తరణకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. అమూల్ విస్తరణపై అధికారులతో సమీక్షించారు. మొగల్తూరులో పాడి రైతులను గుర్తించాలని, లక్ష్యానికి మించి పాల సేకరణకు ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. నరసాపురంలో ఐదు వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యం కాగా తక్కువ మొత్తంలో పాల సేకరణ ఉందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో పాడి పశువుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, డీసీఓ రవికుమార్ పాల్గొన్నారు

క్షయ నియంత్రణలో జిల్లాకు పతకం

దేశవ్యాప్తంగా క్షయ నియంత్రణ చర్యలు పరిశీలనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 39 సంస్థలకు పతకాలు అందించగా పశ్చిమగోదావరి జిల్లాకు కాంస్య పతకం వచ్చిందని డీఎంహెచ్ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ బాలునాయక్ కలెక్టర్ ప్రశాంతిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ నియంత్రణ అధికారి బాలునాయక్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఏఎస్పీ సుబ్బరాజు, డాక్టర్ వి.ప్రసాద్, డీఐఓ దేవ సుధ, జిల్లా పీఎం ఆఫీసర్ సుగుణరాజు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు శివరామ బద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామోత్సవం.. భక్త జన భాగ్యం

- క్షీరారామంలో ఉత్సవ శోభ
- నేడు స్వామివార్ల కల్యాణం

పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ సమేత క్షీరారామలింగేశ్వరస్వామి, లక్ష్మీ సమేత జనార్దనస్వామివార్ల సప్తాహ్నిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివార్లను నంది, గరుడ వాహనాలపై ఘనంగా ఊరేగించారు. శనివారం వేకువజామున 5.15 గంటలకు స్వామివార్ల కల్యాణం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 రథోత్సవానికి ఏర్పాట్లు చేశామని ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయం, పరిసరాలను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. విద్యుద్దీపాలతో క్షేత్రం కాంతులీనుతోంది. ఈఓ యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. – పాలకొల్లు సెంట్రల్



పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూల అలంకరణ



గ్రామోత్సవానికి బయలుదేరిన స్వామివార్లు



శివలింగాకృతిలో అలంకరణ

క్లుప్తంగా


శ్రీవారి సేవలో మంత్రి ఉషశ్రీ చరణ్



శ్రీవారి ఆలయంలో మంత్రి ఉషశ్రీ చరణ్‌కు స్వామివారి మెమెంటోను అందజేస్తున్న ఆలయ ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ శుక్రవారం ఉదయం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనం పలికారు.

శ్రీవారి అశ్వం మృతి



ద్వారకాతిరుమల: బిడ్డకు జన్మనిచ్చిన 24 గంటల వ్యవధిలోనే శ్రీవారి సేవకు వినియోగించే యోగిని అశ్వం శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. కొండపైన గోసంరక్షణశాలలో యోగిని అశ్వం బుల్లి ఆడ అశ్వానికి గురువారం మధ్యాహ్నం జన్మనిచ్చిన విషయం తెలిసిందే. తీవ్ర అస్వస్థతకు గురైన తల్లి అశ్వం అకస్మాత్తుగా మృతి చెందింది. వైద్యం చేయించినప్పటికీ ఫలితం దక్కలేదని ఆలయ అధికారులు తెలిపారు.

ఉపాధి హామీ వేతనం పెంపుపై హర్షం

- రూ.257 నుంచి రూ.272కి పెంచుతూ ఉత్తర్వులు
- ఏలూరు, పశ్చిమలో అదనంగా రూ.27.50 కోట్ల మేర లబ్ధి



వేసవిలో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు జాగ్రత్తలు చెబుతున్న పీడీ రాంబాబు(ఫైల్)

ఏలూరు (టూటౌన్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల వేతనం పెంచుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఏలూరు జిల్లాలోని కూలీలకు అదనంగా రూ. 22 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలోని కూలీలకు రూ.5.50 కోట్ల అదనపు ప్రయోజనం చేకూరనుంది. ఇంతవరకూ ఉపాధి కూలీలకు గరిష్ఠంగా రూ.257 చెల్లిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం రూ.15 పెంచడంతో ఏప్రిల్ 1 నుంచి రూ.272 వేతనం చెల్లిస్తారు. ఉపాధి కూలీల వేతనాల పెంపుదల పట్ల సంతోషం వ్యక్తమవుతున్నా పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా పెంపుదల చేస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఏలూరు జిల్లాలో రూ.22 కోట్ల అదనపు ప్రయోజనం

ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఇచ్చే వేతనం పెంచడంతో జిల్లాలోని కూలీలకు రూ.22 కోట్ల మేరకు అదనపు ప్రయోజనం చేకూరనుంది. ఏలూరు జిల్లా పరిధిలో మొత్తం 3.71 లక్షల మంది కుటుంబాలకు చెందిన 6.65 లక్షల మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. వీరికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా పనులు కల్పిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1.44 కోట్ల పనిదినాలు కల్పించారు. వీరికి వేతనాలుగా రూ.303.85 కోట్ల చెల్లింపులు చేశారు. తాజాగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి వేతనం రూ.15 పెంచారు. 6.65 లక్షల మంది ఉపాధి కూలీలకు అదనంగా రూ.22 కోట్ల ప్రయోజనం కలుగనుంది.

2022-23లో చెల్లింపుల వివరాలు

జిల్లా	జాబ్‌కార్డులు	కూలీలు	వేతనం(కోట్లలో)	మెటీరియల్(కోట్లలో)
ఏలూరు	3.71 లక్షలు	6.65 లక్షలు	రూ.303.85	రూ.106.13
పశ్చిమగోదావరి	1.79 లక్షలు	2.96 లక్షలు	రూ.83.20	రూ.86.02

పశ్చిమగోదావరిలో రూ.5.50 కోట్ల లబ్ధి

కూలీ పెంపుతో పశ్చిమగోదావరి జిల్లాలోని ఉపాధి కూలీలకు రూ.5.50 కోట్ల అదనపు లబ్ధి చేకూరనుంది. జిల్లా వ్యాప్తంగా 1.79 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులుండగా వీటి పరిధిలో 2.96 లక్షల మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు వేతనాలుగా రూ.83.20 కోట్లు, మెటీరియల్ కాంపొనెంట్‌గా రూ. 86.02 కోట్లు అందించారు.

వేతనం పెంపుతో కూలీలకు ప్రయోజనం



ఏప్రిల్ 1 నుంచి ఉపాధి హామీ కూలీలకు ఇచ్చే దినసరి వేతనం పెంపుతో ఎంతో ప్రయోజనం కలుగనుంది. ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో కూలీలకు అత్యధిక పనిదినాలు కల్పించేలా డ్వామా ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం. వేసవిని దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో గత నాలుగు సంవత్సరాల నుంచి ఉపాధి హామీ పథకంలో రికార్డు స్థాయిలో పనిదినాలు కల్పిస్తున్నాం.

డి.రాంబాబు, ప్రాజెక్టు డైరెక్టర్, నీటియాజమాన్య సంస్థ, ఏలూరు

సెంట్రల్ క్రైమ్ స్టేషన్ నుంచి దొంగ పరారీ



పరారైన నిందితుడు

నూజివీడు: పట్టణంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్) నుంచి దొంగ గురువారం రాత్రి పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. ఏలూరుకు చెందిన సలార్‌ఖాన్‌ను చాట్రాయి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అతను చాట్రాయి, నూజివీడు మండలం జంగంగూడెంలోని ఆలయాల్లో దేవుడి ఆభరణాలను చోరీ చేసిన ఘటనల్లో నిందితుడు. ఇంకా ఎక్కడైనా చోరీకి పాల్పడ్డాడా అని విచారిస్తున్నారు. కానిస్టేబుల్, హోంగార్డును కాపలాగా ఉంచగా రాత్రి 9గంటల సమయంలో కానిస్టేబుల్ టిఫిన్ చేయడానికి బయటకు వెళ్లాడు. హోంగార్డు ఒక్కడే ఉన్నాడు. సలార్‌ఖాన్ హోంగార్డును మాటల్లో పెట్టి సీసీఎస్ నుంచి బయటకు వచ్చి అక్కడ ఉన్న బైక్ వేసుకొని పరారయ్యాడు. ఈ విషయం వెంటనే పోలీసు ఉన్నతాధికారులకు కూడా చెప్పకపోవడంతో దొంగను పట్టుకునేందుకు గాలింపు చర్యలు ఆలస్యమయ్యాయి. మూడు బృందాలను ఏర్పాటు చేసి దొంగ కోసం గాలిస్తున్నారు.

సెల్ టవరెక్కి హల్‌చల్

ఉండి: ఉండి తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి సెల్ టవరెక్కి హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉండి ఆంధ్రా బ్యాంక్ సెంటర్ వద్ద ఆటోను ఓ ఆర్టీసీ బస్సు స్వల్పంగా ఢీకొంది. దీంతో ఆటోడ్రైవర్‌కు, బస్సు డ్రైవర్‌కు తగాదా జరిగింది. సమాచారం అందుకున్న ఏఎస్సై ఏ.శ్రీనివాస్ ఆటోడ్రైవర్‌పై పురుష పదజాలం వాడాడు. అనంతరం ఆటోను, బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనను దూషించిన ఏఎస్సైపై చర్యలు తీసుకోవాలంటూ ఆటోడ్రైవర్ దువ్వి సూరి పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న సెల్‌టవర్ ఎక్కాడు. దీంతో ఆర్‌ఐ వీ.ఆంజనేయులు అతనితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చి కిందికి దించారు. అనంతరం ఏఎస్సైకి, ఆటోడ్రైవర్‌కు మధ్య రాజీ కుదర్చడంతో అంతా సద్దుమణిగింది.

ఏజెన్సీ బంద్ ప్రశాంతం



బంద్ సందర్భంగా బుట్టాయగూడెంలో ధర్నా చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ ఆదివాసీ జేఏసీ, గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు ఇచ్చిన ఏజెన్సీ బంద్ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో బస్టాండ్ వద్ద బైఠాయించిన గిరిజనులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ బంద్ కార్యక్రమానికి స్థానిక ముస్లిం సంఘం మద్దతు తెలిపింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వ్యాపార దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. వాహనాల రాకపోకలు కూడా నిలిచిపోయాయి. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మొడియం శ్రీనివాసరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు తదితరులు మాట్లాడుతూ తీర్మానాన్ని రద్దు చేయాలని కోరారు. నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కుర్సం దుర్గారావు, తెల్లం రామకృష్ణ, కారం రాఘవ, టి.బాబూరావు, కేవీపీఎస్ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్, మహిళా నాయకురాళ్లు వెట్టి భారతి, ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో...

జీలుగుమిల్లి మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. గ్రామంలో గిరిజన సంఘాలు భారీ ర్యాలీ చేశాయి.

ప్రశాంతంగా ఏజెన్సీ బంద్

కొయ్యలగూడెం : ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కన్నాపురంలో పార్టీ నాయకులు మెయిన్ సెంటర్లో మానవహారం నిర్మించి బంద్‌కి మద్దతుగా ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐకేఎంఎస్ నాయకులు వి.సద్గురు పేర్కొన్నారు.

శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయము
జక్కరం గ్రామం, కాళ్ళ(మం) ప.గో.జిల్లా
e-Procurement Tender
NIT No.COE/759/2022-20, Dt:28.02.2023
దేవాలయ పునఃనిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ ను చూడగలరు.
ఛైర్మన్

మహిళ హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ఏలూరు (టూటౌన్): మహిళను హత్యచేసిన కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులకు ఏలూరు ఎనిమిదో అడిషనల్ జడ్జి, ఎస్సీ, ఎస్టీ(పీఓఏ) యాక్ట్ కోర్టు జడ్జి ఎం.సునీల్ కుమార్ శుక్రవారం జీవిత ఖైదు విధిస్తూ తుది తీర్పు వెలువరించారు. మరొకరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఏలూరు వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2012 ఆగస్టు 28న గొల్ల లీలావతి హత్యకు గురైంది. కేసుకు సంబంధించి చింతలపూడి మండలం ఎర్రంపల్లి గ్రామానికి చెందిన జగ్గవరపు హరికృష్ణ రెడ్డి(34), కృష్ణాజిల్లా మైలవరం మండలం రెడ్డిగణపవరానికి చెందిన ఏరువ రామకోటి రెడ్డి(26), విజయవాడ రూరల్ నున్న గ్రామానికి చెందిన పామర్తి శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేసారు. చోరీకి గురైన బంగారు వస్తువులు, రూ.90వేల నగదును, మృతురాలికి చెందిన రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో హరికృష్ణ రెడ్డి, రామకోటి రెడ్డిలకు జీవిత ఖైదు, పామర్తి శ్రీనివాసరావుకు రూ.10వేలు జరిమానా విధించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795300]

Real Estate

పొలం అమ్మకం

■ నల్లజర్ల పంచాయితీ పార్క్ ప్రక్కన 490 చ॥గ॥లు ఈస్ట్ ఫేసింగ్ లో ఉన్న గ్రౌండ్ ఫ్లోర్, 1st ఫ్లోర్ సపరేట్ కార్ షెడ్ మామిడి, పనస, ఉసిరి వగైరా ఫలవృక్షాలతో సహా అమ్మకమునకు కలదు.సంప్ర: 63009 40191, 92466 63240 [P-1214697]

■ Wanted Marketing Executives For Realestate Ltd Company Work In Hyderabad only 5 hours with accommodation. 12000/- Salary. Contact: 7675869451 [HA-92803]

■ రాఘవి హోంకేర్ సర్వీస్ Govt Reg. పేషెంట్ కేర్, కేర్ టేకర్స్, ఆయాలు, ANM, GNM, నర్సులు స్త్రీ/పు కా. జీ: 15–45 వేలు, రూం+ఫుడ్ ఫ్రీ & (ఏజెంట్స్ కావలెను) 8977842502 [H-797563]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీతం: 16k - 18k ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258899 [HA-1164]

Services

■ మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లలో అనుభవం ఉన్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. (ప్రాఫిట్‌లో షేర్ ఇవ్వబడును). Mega Group Man Power & Security (AP & TS). Contact : 70326 10569, 70931 25169. [NA-5476]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2332]

■ Wanted Teachers (CBSE), NEET & JEE Faculty, Sal: 12-15 Lakhs, Exp. Candidates, Send C.V. info@dheeranchinnamalaischool.ac.in, Dheeran Chinnamalai School & Academy, Krishnagiri (Dist),Tamilnadu, 9442882228. [T-1201063]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ ✆ 76508 91999 [B-786700]

■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువుతోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-5759]

Wanted

■ తణుకు ఫ్యాక్టరీ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు 25 మంది కావలెను. డ్యూటీ: 8 గం, వీక్లీ ఆఫ్, జీతం: 12,500/- PF & ESI. ✆ 96768 89600, 95509 89842 [B-1165920]

■ ప్రముఖ ఆగ్రో సంస్థ నందు ఇంటి వద్దనే ఉండి జాబ్ చేయుటకు స్త్రీ/పు కావలెను. పార్ట్ టైం స్త్రీలకు ప్రత్యేకంగా... జీతం : 18,000/- జెన్యూన్ జాబ్. మొబైల్ ఫ్రీ : 73869 73420 [G-6629]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నూజివీడులో 900 గ్రాముల గంజాయి పట్టివేత



నూజివీడులో గంజాయి కలిగి ఉన్న యువకుడిని అరెస్టు చేసిన సెబ్ అధికారులు

నూజివీడు: పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కాలనీకి చెందిన మాతంగి సంజయ్(21) వద్ద 900 గ్రాముల గంజాయి ఉండటంతో దానిని స్వాధీనం చేసుకోవడంతో పాటు అతనిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సెబ్ నూజివీడు ఇన్‌స్పెక్టర్ టీ.గోపాలకృష్ణ మాట్లాడుతూ తమ స్టేషన్ పరిధిలోని నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల్లో ఎక్కడైనా కాపుసారా విక్రయించినా, తయారు చేస్తున్నా, సరఫరా చేస్తున్నా, గంజాయి సేవిస్తున్నా, సరఫరా చేస్తున్నా 9440902462 నెంబరుకు ఫోన్ చేసి చెప్పాలని, చెప్పిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మృతదేహం గుర్తింపు

ఉండి: ఉండి మండలం కలిసిపూడి పంటకాలువలో మార్చి 30న లభ్యమైన యువకుడి మృతదేహం భీమవరం మెంటేవారితోటకు చెందిన ముమ్మిన విజయకుమార్ కుమారుడు అభిరామ్(16) దని పోలీసులు తెలిపారు. విజయవాడలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అభిరామ్‌ను మార్చి 28న పరీక్షలు ముగియడంతో ఇంటికి తీసుకువెళ్ళాలని కాలేజ్ నుంచి ఫోన్ చేసి తెలిపారు. అతని తండ్రి కుమారుడిని పంపించేయాలని కోరగా కాలేజీ నుంచి అదే రోజు అతను తన స్నేహితులతో బయటకు వచ్చేశాడు. అనంతరం తన స్నేహితులతో గొడవపడిన అభిరామ్ విజయవాడలో అదేరోజు సాయంత్రం 6:40 ట్రైన్ ఎక్కాడు. ఉండి మండలం కలిసిపూడికి ట్రైన్ చేరుకునే సరికి అభిరామ్ పంటకాలువలోకి పడిపోయాడు. అతనే పడిపోయాడా లేక ఎవరైనా నెట్టేసారా అనే విషయం తెలియరాలేదు. రెండ్రోజుల అనంతరం 30న అభిరామ్ మృతదేహం పంటకాలువలో లభ్యం కావడంతో పోలీసులు భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సారా విక్రేత అరెస్టు

ఆగిరిపల్లి: సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్.చంటిబాబు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆగిరిపల్లిలోని గొడ బజారుకు చెందిన పల్లగాని అంజలి సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఆమె నుంచి 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 7, 8 తేదీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్–19 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు చేపట్టనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వీవీఎస్‌ఎం శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. 2004 సెప్టెంబర్ 1 తర్వాత పుట్టిన వారే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. ఆశ్రం కళాశాల క్రికెట్ గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఒరిజినల్ పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో పాటు సొంత కిట్‌తో హాజరుకావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 94910–44848 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ బ్రిడ్జి కోర్సు పరీక్షలకు 1823 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ బ్రిడ్జి కోర్సు పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన గణితం –1, ఫిజిక్స్–1 పరీక్షలకు జిల్లాలో కేటాయించిన 28 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1823 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలకు ఏలూరు జిల్లాలో 11, పశ్చిమ గోదావరి జిల్లాలో 12, తూర్పు గోదావరి జిల్లాలో 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో మొత్తం 2668 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 845 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర బాబు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.1.32 కోట్లు



హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో శుక్రవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ నిర్వహించారు. 2022–2023 ఆర్థిక సంవత్సరం ముగింపును పురస్కరించుకుని జరిపిన ఈ లెక్కింపులో స్వామివారికి విశేష ఆదాయం సమకూరింది. గత 16 రోజులకు నగదు రూపేణా చినవెంకన్నకు రూ.1,32,12,581 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 176 గ్రాముల బంగారం, 3.394 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ. 1,000, రూ. 500 ల నోట్లు ద్వారా రూ. 4 వేలు లభించినట్టు చెప్పారు. 2021–2022 ఆర్థిక సంవత్సరంలో హుండీల ద్వారా స్వామివారికి రూ. 31,76,33,101 ఆదాయం రాగా, ప్రస్తుతం ముగిసిన 2022–2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 35,46,92,522 ఆదాయం వచ్చింది. దీన్ని బట్టి గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3,70,59,421 పెరిగినట్టు ఈఓ త్రినాథరావు వెల్లడించారు.

జేఎన్టీయూ సౌత్‌జోన్ సెమీఫైనల్ క్రికెట్ పోటీలు



క్రీడాకారులకు నిబంధనలు వివరిస్తున్న హేలాపురి కళాశాల ఏఓ కరుణానిధి, ప్రిన్సిపల్ రాధాకృష్ణ

దెందులూరు : జేఎన్టీయూ సౌత్ జోన్ క్రీడా పోటీలు ముగింపు దశకు చేరాయి. శనివారం వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పీవీపీ సిద్ధార్థ– ఐడియల్ కళాశాల, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్–లచ్చిరెడ్డి బాలిరెడ్డి కళాశాల మధ్య సెమీఫైనల్ పోటీలు జరుగుతాయని ఏఓ కరుణానిధి వివరించారు. విద్యార్థులకు దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

పూళ్లలో ఆస్పత్రి సీజ్

భీమడోలు : పూళ్లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆస్పత్రిని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సీజ్ చేశారు. గ్రామంలోని వినాయకుడి గుడి వద్ద అద్దె ఇంట్లో పీఎంపీ పెనుగొండ శ్రీనివాస్ ఆసుపత్రి నడుపుతున్నట్లు వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో వైద్య ఆరోగ్య శాఖ డీఈఎంవో రత్నకుమారి సీజ్ చేశారు. తన వద్ద చికిత్స నిమిత్తం రూ. 30 వేల వరకు వసూలు చేశారని స్పందనలో బిరుదుగడ్డ నరేష్ ఫిర్యాదు చేయడంతో ఇటీవల పూళ్ల వైద్యాధికారి లీలాప్రసాద్ విచారణ చేశారు. నివేదికను డీఎంహెచ్‌వోకు సమర్పించారు. పీఎంపీ శ్రీనివాస్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని నిర్ధారణ కావడంతో పోలీసుల సమక్షంలో ఆసుపత్రిని సీజ్ చేసారు. తదుపరి చర్యలకు సిఫార్సు చేశారు.

కళానైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఆర్ట్ ఎగ్జిబిషన్ దోహదం



ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు గీసిన చిత్రాలను పరిశీలిస్తున్న చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి

నూజివీడు: విద్యార్థుల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఆర్ట్ ఎగ్జిబిషన్ దోహదపడుతుందని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నడుస్తున్న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్–3 నిర్వహించిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఛాన్సలర్ శుక్రవారం సందర్శించి, విద్యార్థులు ప్రదర్శించిన ఆర్ట్‌లను పరిశీలించారు. శ్రీకాకుళం విద్యార్థులు ఆర్ట్‌కు సంబంధించిన జాతీయ పోటీల్లో పాల్గొనాలన్నారు. ట్రిపుల్‌ఐటీలోని విద్యార్థులు, అధ్యాపకులు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించి ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్లు ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, ఆచార్య పీ.జగదీశ్వరరావు, రిటైర్డ్ వీసీ కే.వియ్యన్నరావు, ట్రిపుల్ ఐటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భాను కిరణ్, శ్రీకాకుళం డీన్ ఆఫ్ అకడమిక్స్ కే.మోహన్‌కృష్ణ, ఏవో పీ.ప్రదీప్ కుమార్, డీన్ అకడమిక్స్ బీ.లక్ష్మణరావు తదితరులు ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.


మహిళలకు రక్షణగా దిశ చట్టం



ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న దిశ టీం ప్రతినిధులు

తాడేపల్లిగూడెం అర్బన్: మహిళలకు దిశ చట్టం రక్షణగా ఉంటుందని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్‌కు వివిధ స్థాయిల్లో నియమితులైన దిశ మహిళా ప్రతినిధులు కొట్టు సత్యనారాయణను కలిసి శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి కొట్టు చేతుల మీదుగా గుర్తింపు కార్డులు, నియామక పత్రాలు తీసుకున్నారు. ప్రతినిధులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మహిళలకు దిశ చట్టం ద్వారా న్యాయం చేసే అవకాశం వచ్చిందన్నారు. దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సంస్థకు పేరుప్రతిష్ఠలు తెచ్చేలా కృషి చేయాలన్నారు. మంత్రి కొట్టును దిశ మహిళా ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ బి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి కోల్లా విజయలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు మనుపర్తి లలిత, జిల్లా ఉపాధ్యక్షురాలు తాటిపాక రమాదేవి, అధికార ప్రతినిధి ఎం.రూన్సీ, పట్టణ అధ్యక్షురాలు బోణం విజయనిర్మల, అల్లూరి సుజాత, ఎంపీపీ శేషులత, నూనె రాధ, ప్రవీణ, వై.జయంతి పాల్గొన్నారు.

పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



భీమడోలు: భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టాలపై శుక్రవారం రైల్వే పోలీసులు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. సుమారు 50 ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. మృతుడి జేబులో గణపవరం నుంచి భీమడోలు వచ్చినట్లు బస్ టికెట్లు ఉన్నాయని, మృతుడు గణపవరం, భీమడోలు పరిసర గ్రామాలకు చెందిన వాడై ఉండవచ్చని చెప్పారు. ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



తణుకులో క్యాన్సర్ బాధితురాలికి చెక్కును అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తణుకు టౌన్: క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళకు తణుకు మానవత సంస్థ రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు తణుకు మానవత సంస్థ అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు తెలిపారు. శుక్రవారం తణుకు వీరనారాయణ థియేటర్ వద్ద నివాసం వుంటున్న రిక్షా కార్మికుడు మగసాల కృష్ణ కుమార్తె మేరీ గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ వైద్య సహాయం కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. ఈవిషయం తెలుసుకున్న తణుకు మానవత సంస్థ రూ. 10 వేల చెక్కును మందుల ఖర్చుల కోసం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు ఆనందం మస్తాన్‌రావు, పులమాల భద్రం, బీ రామకాశీ, మండాల సూర్యం, మల్లంపల్లి నరశింహారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఉమామహేశ్వరం నెం-1 పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యాధికారిణి

పెంటపాడు: విద్యార్థులు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పెంటపాడు ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ వి. మౌనిక పేర్కొన్నారు. ఉమమహేశ్వరం నెం-1 ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం వట్రపు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్న ద్వారా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నైతిక విలువలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం జయప్రద, హెల్త్ సూపర్‌వైజర్ వై. నరేంద్ర, ఆశా వర్కర్ రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు.

తణుకు బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక




సూరంపూడి కామేష్ చింతపల్లి నాగేశ్వరరావు

తణుకు: తణుకు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో 2013-24 సంవత్సరానికి గాను నూతన కమిటీను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సూరంపూడి కామేష్, ఉపాధ్యక్షుడిగా చింతపల్లి నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా కేవీవీ సత్యనారాయణమూర్తి, జాయింట్ సెక్రటరీగా హెచ్ నాగార్జునదాస్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కత్తుల జెస్పాల్, లేడీ రిప్రజెంటేటివ్‌గా కంబాల లక్ష్మిసత్యవతితోపాటు ఆరుగురు ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా కామన మునిస్వామి, గొల్లపల్లి అంబేద్కర్, వీవీ సత్యసాయి, ఎన్.సోమేశ్వరరావులు వ్యవహరించారు.

గూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొవ్వూరి అప్పిరెడ్డి



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొవ్వూరి అప్పిరెడ్డి విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా తోట మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దాసం సునీల్, జాయింట్ సెక్రటరీగా దాసరి ఏకాంత్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పీవీఎస్‌వీ భద్రుడు, కోశాధికారిగా కొత్తపల్లి ప్రసాద్, మహిళా రిప్రజెంటేటివ్‌గా మల్లిడి గీతారెడ్డి, ఏడుగురు ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా రామకృష్ణపరమహంస, తోట సత్యనారాయణ, పీతల సుధాకర్, గుత్తికొండ శ్రీనివాసరావులు వ్యవహరించారు.

ముత్యాలమ్మ తల్లికి వెండి బహూకరణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మవారి చీర నిమిత్తం తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన కారుమూరి రాజమోహన్ గుప్తా పావు కిలో వెండిని శుక్రవారం ఆలయ కమిటి సభ్యులకు అందజేశారు.ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.హరేరాంప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, అర్చకులు పాల్గొన్నారు.

రైలు వచ్చి ఆగిందంటే పరుగులు పెట్టాలి

- స్టేషన్ ఆధునీకరణ చేసినా వసతులేవీ..?
- కోచ్ డిస్‌ప్లే, లిఫ్టు సౌకర్యాలు లేక అవస్థలు



నూతనంగా ఆధునికీకరించిన తణుకు రైల్వేస్టేషన్



ప్లాట్‌ఫారంపై పరుగులు పెడుతున్న ప్రయాణీకులు

తణుకు: తణుకు రైల్వే స్టేషన్‌లో రైలు వచ్చి ఆగిందంటే చాలు ప్రయాణీకులు పరుగులు పెట్టాల్సిందే.. ఏ బోగీ ఎక్కడ ఆగుతుందో తెలియక ప్రయాణీకులు నిత్యం అవస్థలు పడాల్సిందే... పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి సాధించిన తణుకు పట్టణంలో రైల్వే స్టేషన్ ఆధునికీకరించినప్పటికీ కనీస సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. కనీసం కోచ్ ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణీకులు నిత్యం ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. మరోవైపు లిఫ్టు సౌకర్యం లేకపోవడంతో ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం నుంచి రెండో ప్లాట్‌ఫారంపైకి రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల పలు ప్రజా సంఘాల నాయకులు రైల్వే అధికారులకు వినతి పత్రాలు సైతం అందజేశారు.

రూ. వందల కోట్లతో అభివృద్ధి...

భీమవరం నుంచి నిడదవోలు వరకు విద్యుదీకరణ పనులతో సహా డబ్లింగ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకోసం రైల్వే శాఖ రూ. వందల కోట్లు వెచ్చించింది. అయితే నిత్యం వేలాది మంది ప్రయాణీకులను తమ గమ్యస్థానాలకు చేరవేసేందుకు నిర్మించిన తణుకు రైల్వే స్టేషన్‌లో మాత్రం అధికారులు కనీస వసతులను మర్చిపోయారు. తణుకులోని రెండు ప్లాట్‌ఫారాలను విస్తరించారు. ఇందుకు నూతనంగా బ్రిడ్జి సైతం నిర్మించారు. అయితే వృద్ధులు, దివ్యాంగులు రెండో నెంబరు ప్లాట్‌ఫారంపైకి వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో అయితే మరిన్ని అవస్థలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు రెండో నెంబరు ప్లాట్‌ఫారంపైకి వస్తుంటాయి. దీనికి తోడు రాత్రి సమయాల్లోనే ఎక్స్‌ప్రెస్ రైళ్లు తణుకు రైల్వే స్టేషన్‌కు వస్తుంటాయి. ఈ పరిస్థితుల్లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణీకులతో పాటు ఇక్కడి నుంచి దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు తమ లగేజీతో పాటు మెట్లు ఎక్కి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

ఏ బోగీ ఎక్కడ ఆగుతుందో...?

సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు అష్టకష్టాలు పడి ప్లాట్‌ఫారంపైకి చేరుకుంటే ఏ బోగీ ఎక్కడ ఆగుతుందో తెలియక తికమక పడుతుంటారు. కనీసం ప్లాట్‌ఫారంపై కోచ్ ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రైలు వచ్చి ఆగిందంటే చాలు వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తమ బోగీ ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు పరుగులు పెడుతుంటారు. ఈ సమయంలో ఒక్కో సారి ప్లాట్‌ఫారంపై పడి గాయాలపాలవుతున్న ప్రయాణీకులు ఉంటున్నారు. రైల్వేస్టేషన్ ఆధునికీకరించినప్పటికీ కనీస వసతులైన కోచ్ ఇండికేషన్ బోర్డులు, లిఫ్టు ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు రైల్వే అధికారులకు పలు వినతి పత్రాలు అందజేశారు. అధికారులు స్పందించి రైల్వే స్టేషన్ కోచ్ ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుకుంటున్నారు.

కులరహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి



పెదతాడేపల్లి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

తాడేపల్లిగూడెం రూరల్: కులరహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని తహసీల్దార్ వైకేవీ.అప్పారావు అన్నారు. శుక్రవారం మండలంలోని పెదతాడేపల్లి సచివాలయం వద్ద పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అప్పారావు మాట్లాడుతూ సమాజంలో అందరూ కలిసి మెలసి జీవించాలన్నారు. కులం పేరుతో ఎవరినైనా దూషించినా, దుర్భాషలాడినా చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వారు శిక్షార్హులన్నారు. ఎస్సై వీఎస్.వీరభద్రరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహనతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ ప్రసాద్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మెరిపో జాన్ రాజు, ఆర్ఐ శివప్రసాద్, సెక్రటరీ రవిచంద్ర, ప్రజలు పాల్గొన్నారు.

మండపాకలో డ్వాక్రా మహిళల ఆందోళన



మండపాకలో గాంధీ బొమ్మ వద్ద ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు

తణుకు టౌన్: తణుకు మండలం మండపాక గ్రామంలో డ్వాక్రా మహిళలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. గ్రామంలోని డ్వాక్రా భవనం స్థలంలో అక్రమ నిర్మాణానికి నిరసనగా గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. 2017 సంవత్సరంలో అప్పటి పంచాయతీ పాలకవర్గం గ్రామంలోని డ్వాక్రా మహిళల సమావేశాలకు అవసరమైన భవన నిర్మాణానికి గ్రామ పంచాయతీకి చెందిన 5 సెంట్ల భూమిని కేటాయించింది. దీనిలో భవన నిర్మాణం చేపట్టారు. ఈ భూమిలో భవనం నిర్మించగా మిగిలిన స్థలంలో గ్రామానికి చెందిన ఓ సామాజిక వర్గం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం తీర్మాణం చేసినట్లు పేర్కొంటున్నారు. ఈ తీర్మాణం మేరకు శుక్రవారం ఆ సామాజిక వర్గ పెద్దలు నిర్మాణ పనులు చేపట్టడంతో గ్రామంలోని డ్వాక్రా మహిళలు నిరసనకు దిగారు. ఈ విషయంపై గతంలోనే తహసీల్దార్, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేసినట్లు ఏపీఎం ఏ రామకృష్ణ తెలిపారు. దీనిపై పోలీసులకు కూడా పిర్యాదు చేసినట్లు తెలిపారు. పంచాయతీ స్థలంలో నిర్మాణ పనుల విషయమై ఉన్నతాధికారులకు నివేధిస్తామని అప్పటి వరకూ అక్కడి పనులు నిలుపుదల చేయాలని సీఐ సీహెచ్ ఆంజనేయులు సూచించడంతో ఇరు వర్గాలు తమ ఆందోళనను విరమించారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



ముద్దాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ధ్వంసం చేయడం దారుణమని, ధ్వంసం చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టి శిక్షిస్తామని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం ముద్దాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గల అంబేడ్కర్ విగ్రహాన్ని ఇటీవల ధ్వంసం చేసిన సంఘటన స్థలాన్ని మంత్రి కారుమూరి పరిశీలించారు. అనంతరం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ముళ్లపూడి బాబూరావు, జిల్లా రైతు విబాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, గ్రామ సర్పంచ్ మజ్జి పద్మ, దువ్వ సర్పంచ్ అడ్డా బాబు, కోనాల సర్పంచ్ మల్లిపూడి చిన్నయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మగంటి నాగ సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు సైదు త్రిమూర్తులు, మండల కమిటీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి రైతుల సహకారం అవసరం



రావిపాడు మహాజనసభ సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షులు దేవ వెంకటరమణ

పెంటపాడు: సహకార సొసైటీ అభివృద్ధికి రైతుల చేయూత ఎంతో అవసరమని రావిపాడు సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకట రమణ తెలిపారు. శుక్రవారం రావిపాడు సహకార సొసైటీ మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రైతుల సహకారంతో ఈ ఆర్థిక సంవత్సరంలో 13.54 కోట్ల టర్నోవర్ సాధించినట్లు తెలిపారు. వ్యవసాయ, ఎల్‌టీ రుణాలు, కౌలురైతు రుణాలు, ఓపెన్‌ఫండ్ రుణాలతో పాటు, ఎరువుల వ్యాపారం కలిసి ఈ టర్నోవర్ సాధించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సొసైటీని మరింత లాభాల బాటలో నడిపేందుకు రైతులు సహకారం కావాలన్నారు. తీసుకొన్న రుణాలు సక్రమంగా చెల్లిస్తూ బ్యాంక్ అభివృద్ధికి తోడ్పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుడు వింజమూరి శ్రీనివాస్, దాట్ల రామలింగరాజు, సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, సొసైటీ కార్యదర్శి రాంబాబు రైతులు పాల్గొన్నారు.

నవాబుపాలెం సొసైటీ మహాజన సభ



తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం సొసైటీ మహాజన సభ దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం సొసైటీ ఆవరణలో శుక్రవారం మహాజన సభ నిర్వహించారు. సొసైటీ త్రిసభ్య కమిటి చైర్మన్ జద్దు హరిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రూ.65.56లక్షల లాభంతో అంచనా బడ్జెట్, జమా ఖర్చులను సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశంలో సంఘ పాలకవర్గ సభ్యులు చిట్టూరి భాస్కరరావు, మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, సీఈవో పీవీవీ.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి రథోత్సవం



రథోత్సవంలో భాగంగా భక్తులు అరటిగెలలు సమర్పిస్తున్న దృశ్యం

పెంటపాడు : ప్రసిద్ధి చెందిన కె. పెంటపాడు బైరాగి మఠంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీరామనవమి పురస్కరించుకొని స్వామి గ్రామోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు త్రిలోచన దాస్, పూర్ణచంద్ర త్రిపాఠి, రామశర్మలు ఉదయం నుంచి చైత్రశుద్ధ దశమి పురస్కరించుకొని ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో నిత్యార్చనలు, తులసీదళ సహస్రనామ అర్చనలు, విశేషపూజలు, నిత్యహోమాలు, బలిహరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సన్నాయిమేళం, తీన్‌మార్, నాధస్వరబృందం, విచిత్ర వేషాల నడుమ స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అరటిగెలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి రథోత్సవం రోజు పురస్కరించుకొని గ్రామదేవత పెంట్లమ్మ అమ్మవారి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాయంత్రం అమ్మవారిని గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పట్టణంలో ర్యాలీ దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని 34, 35 వార్డుల సచివాలయాల్లో డ్రై డే, ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల వ్యాప్తిని అరికట్టేందుకు, ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు పాటుపడద్దామన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని వృధా చేయరాదని, నీటి నిల్వలపై మూతలంచాలని సూచించారు. కీటకజనిత వ్యాధుల నియంత్రణ, తీసుకోవాల్సిన ఉపశమన చర్యలపై అవగాహన కల్పించారు. ఫీవర్ సర్వేలు చేశారు. ఈ కార్యక్రమంలో వెక్టార్ కంట్రోల్ హైజీన్‌పై క్షేత్రస్థాయిలో అమలుపై పలు సూచనలు చేశారు. ఆరోగ్య కార్యదర్శులు వి.జయశీల, వై.రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు రజియా బేగం, కె.లలిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న ఆలయ కమిటీ అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సీతారాంపేటలోని రామాలయంలో ఆలయ మహిళా కమిటీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం, వెంకటేశ్వర స్వామి గానామృతం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మారం లక్ష్మి, ఆకుల లక్ష్మి,, భూమా శివ కుమారి, అమరకుమారి, ఉమా, సునీత, కుమారి తదితరులు పాల్గొన్నారు.

విచారణ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జిజ్జువరపు రవి ప్రకాష్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులపై విచారణ వేగవంతం చేయాలని బహుజన సేన సమితి (బీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ కోరారు. పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో శుక్రవారం బీఎస్ఎస్ అధ్యక్షతన జిల్లా సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసు నమోదైన కేసులను వెంటనే విచారణ వేగవంతం చేయాలని, ఫిర్యాదులను జీరో ఎఫ్ఐఆర్ కింద కేసులు నమోదు చేయాలని, బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుంటూరు నవీన్ కుమార్, కలిదిండి శ్రీను, రావూరి నాగేశ్వరరావు, పెనుమాక వెంకట్రావు, వెంకట కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం వైపు ముందుకు సాగాలి



పెదతాడేపల్లి గురుకుల విద్యాలయంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సూర్యకుమారి

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థులు లక్ష్యం వైపు ముందుకు సాగాలని ఆంధ్రప్రదేశ్ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ జి.సూర్యకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, వాటి సాధన కోసం కృషి సాగించాలన్నారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ బి.రాజారావు మాట్లాడుతూ విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, పేరెంట్స్ కమిటి వైస్ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తేతలి ఉప సర్పంచ్ కోట రాజీనామా

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామ ఉప సర్పంచ్ కోట నాగేశ్వరరావు రాజీనామా చేశారు. ఈమేరకు శుక్రవారం తన రాజీనామా లేఖను ఎంపీడీవో టీఎస్‌మూర్తికి అందజేశారు. తన వ్యక్తిగత కారణాల వలన తన ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు, వార్డు మెంబరుగా కొనసాగుతానని కోట నాగేశ్వరరావు తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలి



తాడేపల్లిగూడెం మండలం మారంపల్లి పాఠశాలలో విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని వీడి ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని మారంపల్లి ఉప సర్పంచ్ సరిపల్లి పెదవెంకటరాజు అన్నారు. మనోజ్ఞ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మారంపల్లి సంస్కృత ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ పెదవెంకటరాజు మాట్లాడుతూ ఒత్తిడి, ఆందోళన విడిచిపెట్టి సమయ పాలనతో పరీక్షలు రాయాలన్నారు. ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ విజయశ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమైందని, ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాస్తే ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.కనకదుర్గ, నవాబుపాలెం మాజీ డైరెక్టర్ కళ్లేపల్లి లక్ష్మీపతిరాజు, సయ్యద్ ఫాతిమా, మహ్మద్, అహ్మద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సోము వీర్రాజు అవాకులు, చెవాకులు మాట్లాడటం సరికాదు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మీద బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు అవాకులు, చవాకులు మాట్లాడటం సరికాదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఖండించారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలోకి చేర్చాలని కోరుతూ కేంద్రానికి అసెంబ్లీ తీర్మానం పంపడంపై సోము వీర్రాజు ముఖ్యమంత్రిపై విమర్శలు చేశారని, ఇది సరికాదన్నారు. క్రిస్టియానిటీ అనేది మతం కాదని మార్గమన్నారు. క్రైస్తవ మతం తీసుకున్నంత మాత్రన దళితులు అభివృద్ధి చెందినట్లు కాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ఏసురత్నం , సుజ్ఞాన్, వెంకట్‌లు పాల్గొన్నారు.

పదో తరగతి మార్కులే భవిష్యత్‌కు పునాది

తణుకు టౌన్: విద్యార్థులు భవిష్యత్‌కు పదో తరగతిలో సాధించిన ప్రగతి ఒక ప్రమాణికంగా ఉంటాయని తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా విద్యా సంస్థల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి చెప్పారు. శుక్రవారం తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ప్రాంగణంలోని వివేకానంద గ్లోబల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సభలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పదో తరగతి అనంతరం విద్యార్థులు భవిష్యత్‌కు అవసరమైన కోర్సులను ఎంచుకోవాలని సూచించారు. సెక్రటరీ చిట్టూరి రీనా సాయి, చిట్టూరి వెంకట కృష్ణారావు, ఏవో డాక్టర్ డీ సుబ్బారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395, 63097 62918

తణుకు: 90108 43311, 90100 51493

Office mail : tpgadvt@gmail.com